# కొత్త కెరటం

స్వర్ణ మల్లికార్జున ప్రసాద్

ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌నుంచి ఛాంబర్‌కు వచ్చాను. నర్సింహులును పిలిచి ఒక కప్పు టీ ఇవ్వమన్నాను.

ఫ్లాస్క్‌లో 'టీ' కప్‌లోకి వంచుతూ చెప్పాడు. "సార్ అమ్మగారు ఫోన్ జేసారు. మీరు మీటింగ్‌లోవున్నారని చెప్పాను. మీరొచ్చాక ఒకసారి ఇంటికి ఫోన్ జెయ్యమన్నారు అన్నాడు. టైమ్ చూసుకున్నాను - ఐదూ ఇరవయి అయింది.

ఒకవేళ పిక్చర్ ప్లాన్ చేసిందేమో సుజాత అనుకుంటూ నంబర్ డయల్ చేశాను.

'అమ్మయ్య - ఉన్నారా - అరగంటనుంచి మీ ఫోన్‌కోసం ఎదురుచూస్తున్నాను' అన్నది ఫోన్ ఎత్తుకుంటూనే.

'ఏమిటి విశేషం?' అన్నాను చిన్నగా.

విశేషమంటే విశేషమే. మీరట్నుంచటు మార్కెట్‌కువెళ్ళి నాలుగుడజన్లు పండ్లూ, ఆకులూ, వక్కలూ తీసుకురండి' అన్నది హడావిడిగా.

ఏం నోమునోస్తున్నావోయ్ ఈవేళ శ్రావణ శుక్రవారం కూడా కాదే అన్నాను.

కొన్ని పేరంటాలకు వారాలూ వర్జ్యాలూ వుండవు త్వరగా బయలుదేరి ఇంటికి రండి మీ ముద్దులకూతురు 'కుమారి' జీతూకు అక్షింతలు వేద్దురు అంది 'కుమారి' ఒత్తిపలుకుతూ.

ఆ మాటతో విషయం అర్థమయింది. జీతూ మెచ్యూరయ్యింది. ఆ ఆలోచన నాలో కలవరం రేపింది. పైన ఫ్యాన్ తిరుగుతున్నా వళ్ళంతా చిరుచెమటలు పట్టినయ్యి. జీతూకి మూడురోజులక్రితమే 'టెన్త్'క్లాసు ఎగ్జామ్స్ మొదలయ్యాయి. ఈరోజు ఉదయం మాథ్స్ ఫస్ట్ పేపర్ అయిపోయివుంటుంది. ఇంకా రాయాల్సినవి చాలావున్నాయి. ఇప్పుడు 'జీతూ'మెచ్యూరయ్యిందంటే ఇక ఎగ్జామ్స్ రాయటం ఒట్టిమాటే. 'సుజాత ఒట్టి చాదస్తురాలు జీతూను 5 రోజులవరకు ఇంట్లోనుంచి కదలనివ్వదు. జీతూ ......

**స్త్రీకి ప్రథమ శత్రువు ప్రకృతే. పురుషుని కంటె భిన్నమయిన శరీరధర్మాలను ఆపాదించి పురుషుడికంటె ఒక మెట్టు దిగువున వుంచింది. ప్రతి క్షణం ఆవిడ అబలత్వాన్ని గుర్తు చేస్తూ వుంటుంది. వీటిని ఆసరాగా తీసుకున్న ఆచారాల సంకెళ్ళు స్త్రీని మరింత దిగజారుస్తున్నాయి.**

నాముద్దుల జీతూ ....... చదువే ప్రాణమయిన జీతూ ఎంత రోదిస్తున్నదో? కరంటు లేకపోయినా హరికేన్ లాంతరు వెలుగులో ముచ్చటగా చదువుకుంటున్న 'జీతూ' అమాయకపు ముఖం జ్ఞాపకానికొచ్చింది.

డస్క్‌లాక్‌చేసి ఛైయిర్‌లోనుంచి లేచాను. అప్పటికే ఆఫీస్ స్టాఫంతా వెళ్ళిపోయారు. ఎగ్జిక్యూటివ్ మీటింగ్ వుండటంవల్ల నేను అప్పటివరకూ వుండవలసి వచ్చింది. - నేను వెళ్ళటం కోసమే నర్సింహులు ఎదురుచూస్తున్నట్లున్నాడు.

స్టాండ్‌లోనించి స్కూటర్ తీసి స్టార్ట్ చేశాను. స్కూటర్ ఇంటిదారిపట్టింది.

మార్కెట్‌కు వెళ్ళలేదా? నర్సింహుల్ని పంపించారా? అన్నది సుజాత వాకిట్లోనే ఎదురవుతూ. నేనేమీ మాట్లాడలేదు. ముందు నాచిట్టి తల్లి ఎలావుందో చూడాలి. వేగంగా ఇంట్లోకి వెళ్ళాను.

డ్రాయింగ్ రూమ్‌లో చెప్పులస్టాండ్ వుండాల్సిన చోట జీతూ నివాసమయింది. కొబ్బరాకులు పరిచి వాటిమీద తెల్లటి ధోవతి వేశారు. అక్కడే మౌనంగా తలవంచుకుని కూర్చొనివుంది జీతూ. అశోకవనంలో సీతలా.

దాని వదనంలో సంతోషఛాయలు కన్నీటిచారలకింద కరిగిపోయాయి. అడుగులచప్పుడుకు తలెత్తిచూసింది. నన్ను చూస్తూనే ఒక్క వుదుటున లేచి 'డాడీ' అంటూ నన్ను పెనవేసుకుని పెద్దగా ఏడ్వడం మొదలుపెట్టింది.

నాచిట్టితల్లి జీతూ ........... డాక్టర్ కావలసిన జీతూ అలా పేషంట్‌లా రోదించటం నేను భరించలేకపోయాను.

'ఊరుకోమ్మా' డాక్టర్ దగ్గరకు వెళదామా. కడుపులో నొప్పిగావుందా అన్నాను. జీతూను అనునయిస్తూ.

అయ్యో ఇదెక్కడి చోద్యమండీ డాక్టరు దగ్గరకెళ్ళేందుకు ఇదేమయినా రోగమా - రొష్టా? మైలూ - శుచీ లేకుండా మరీ ఇంత అఘాయిత్యపు మనుషులయ్యారు. దాన్నొదిలి ఇవతలకురండి. "జీతూ నీకెన్నిసార్లు చెప్పాను అక్కడనుండి కదలకూడదని" - అరచినట్లుగా అన్నది సుజాత.

జీతూ నన్ను వదల్లేదు. ఏడుస్తూనే అన్నది. డాడీ నేను ఎగ్జామ్స్ రాస్తాను నన్నాపద్దని మమ్మీకి చెప్పండి డాడీ. మమ్మీ నన్ను పంపించనంటోంది. అయిదు రోజులు ఎక్కడికీ కదలకూడదట

మీరయినా చెప్పండి డాడీ. మొన్న 'ప్రీ' పబ్లిక్‌లో కిషోర్‌కి ఫస్ట్‌రాంక్ వచ్చిందని నన్నెంత గేలి చేశాడు. తనకంటె అయిదు మార్కులే కదా తక్కువ. ఇప్పుడెలాగయినా కిషోర్‌కంటె ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలి. నేను ఎగ్జామ్స్ రాస్తాను డాడీ అన్నది.

స్త్రీ జీవితంలోకి యవ్వనం చెప్పకుండానే వస్తుంది. అది నా చిట్టి తల్లి జీవితంలోకి వస్తూనే వెన్నుపోటు పొడిచింది. 'బాల్యాన్ని జయించిన యవ్వనమా నా చదువులతల్లి 'కిషోర్‌ను జయించాలనుకున్నప్పుడే రావాలా నువ్వు.


- జీతూ ఏడవకమ్మా నువ్వు ఎగ్జామ్స్ రాయటం మానక్కర్లేదు ఆఫీసుకి శలవు పెట్టయినా నిన్ను తీసుకెళ్ళి ఎగ్జామ్స్‌రాయిస్తాను. మమ్మీకి నేను చెబుతానుగా. వెళ్లి కాసేపు రెస్ట్ తీసుకో మళ్ళీ రేపు ఎగ్జామ్‌కి ప్రిపేరవ్వద్దూ అన్నాను.

అప్పటి వరకూ తొలియవ్వనం పెట్టిన క్షోభను ఒక్కక్షణంలోనే మర్చిపోయి నిజమా డాడీ అన్నట్లు నా కళ్ళలోకి చూసింది.

'ష్యూర్ బేబీ' - ఈ సారి స్కూల్‌ఫస్ట్ మా డాక్టరుగారిదే' అన్నాను తన రెండు చెంపలూ నిమురుతూ. ఆ మాటతో జీతూ తృప్తిపడింది. ప్రపంచాన్ని జయించిన ఉత్సాహంతో 'రేక్‌'లోనుంచి బుక్స్ తీసుకుని మళ్ళీ కొబ్బరాకుల సింహాసనం అధిష్టించబోయింది.

జీతూ నీ గదికి వెళ్ళమ్మా అక్కడకూర్చోవాల్సిన అవసరంలేదు అన్నాను షూస్ విప్పుకుంటూ.

స్త్రీకి ప్రథమ శత్రువు ప్రకృతే. పురుషులకంటె భిన్నమయిన శరీరధర్మాలను ఆపాదించి పురుషుడికంటె ఒక మెట్టు దిగువున వుంచింది. ప్రతిక్షణం ఆవిడ అబలత్వాన్ని గుర్తుచేస్తూ వుంటుంది. వీటిని ఆసరాగా తీసుకున్న ఆచారాల సంకెళ్ళు స్త్రీని మరింత దిగజారుస్తున్నాయి.



సాధించాలనుకున్న 'ఎచివ్‌మెంట్'కు అనుక్షణం అడ్డుతగులుతూ వారిని మరింత కృంగదీస్తున్నాయి. - తన చెల్లెలు - రేవతి - లాయరు కావాలని ఎన్ని కలలు కన్నది. ఇంటర్మీడియట్ చివరి ఎగ్జామ్ రోజున 'మెన్సెస్' అవ్వటంతో దాని జీవితగమనమే మారిపోయింది. -మెన్సెస్‌లో కడుపు నొప్పి - మెలికలు తిరిగిపోయింది. పరీక్షకు మాత్రం వెళ్ళలేక పోయింది. నల్లకోటు తొడుక్కోవాలన్న ఆశల చుక్కాని నాన్నకిచ్చేసి, అశ్రునయనాలతో అత్తవారింటికి వెళ్ళిపోయింది.

-త్వరగా ఆ బట్టలు విప్పేసి స్నానంచేసి రండి. చంద్రమన్నయ్యఇంటికివెళ్ళద్దూ? వదిన్ని సాయం తెచ్చుకుంటే గాని రేపు పేరంటం ఏర్పాట్లు చెయ్యలేను. అన్నది సుజాత కాఫీ అందిస్తూ. స్నానం చేసి పట్టుచీరకట్టుకుని ముస్తాబయి వుంది. గదిలో మూల జీతూ లేకపోవటం చూసి జీతూ ఎక్కడికి వెళ్ళింది ? 'జీతూ' అని కేకేసింది ఒక్కసారిగా.

- దాన్ని డిస్టర్బ్ చెయ్యకు చదువుకోనీ అన్నాను తనవైపు తిరిగి.


మీ' గారాబంతో దాన్ని మరీ చెడగొడుతున్నారు. అలా 'ముట్లు' ఇంట్లో కలుపుకుంటారా అన్నది ఆవేశంగా.

నువ్వు శుచిగా వుంటున్నావుగా చాల్లే ఇంకా దాన్ని కూడా ఎందుకు బాధపెడతావు అన్నాను. అసహనంగానే మౌనం వహించింది.

పెళ్లయిన కొత్తల్లో సుజాతను కూడా ఎడంగా వుండద్దనే అన్నాను. అందుకు తను ఒప్పుకోలేదు. అట్లా కలుపుకోవటం పాపం అంది.

అందరికీ తెలిసేటట్లు అలా ఎడంగా వుంటూ నేను 'మెన్సస్ అయ్యానోహో' అంటూ చాటుకోవటం సిగ్గుగా వుండదా అన్నాను. అందులో సిగ్గుపడాల్సిన విషయమేముంది అన్నది. నేనాశ్చర్యపోయాను. సాంప్రదాయ కుటుంబంలోంచి వచ్చిన ఆవిడ నైజం అంతేలెమ్మని సరిపెట్టుకున్నాను. కానీ, జీతూ విషయంలో అందుకు అంగీకరించలేక పోయాను.

- త్వరగా బయలుదేరండి భారతిగారు కారు




తెస్తానన్నారు అన్నది సుజాత ఆవిషయాన్ని అంతటితో వదిలేస్తూ.

నా కొలీగ్ ప్రభాకర్ భార్య భారతి. కంపెనీ ఇచ్చే 'లోన్' సదుపాయంతో కారుకొనుక్కున్నారు. ప్రభాకర్ కంటే ఆవిడే డ్రైవింగ్‌లో దిట్ట అని ప్రతీతి.

మరింకేం మీరిద్దరూ వెళ్లిరండి చందూ ఇంటికి అన్నాను షర్టు విప్పుకుంటూ.

********* *********

కంపెనీ డాక్టరుకి ఫోన్ చేశాను. ఫోన్‌లోనే చిన్నగానవ్వుతూ సమాధాన మిచ్చింది. 'యూడోన్ట్‌వర్రీ మిస్టర్ విశ్వనాథ్' పాప తప్పకుండా అటెండవ్వచ్చు. నీరసంగా లేకుంటే సరి. డ్యూటీ నుండి వెళ్ళేప్పుడు తప్పకుండా వచ్చివెళతాను అన్నది.

స్నానం చేసి లుంగీ షర్టు వేసుకున్నాను. ఒకసారి కిచెన్‌లోకి తొంగి చూశాను. షెల్ఫ్‌లో బోర్న్‌విటా కనిపించింది. దానిని చేతులోకి తీసుకుని పాలకోసం ఫ్రిజ్ ఓపెన్ చేశాను. ఎదురుగా బత్తాయిలు దర్శనమిచ్చాయి. బోర్న్‌విటాను షెల్ఫ్‌లోనే వుంచేసి బత్తాయిలు తీసుకున్నాను. పదినిమిషాల తరువాత చేతిలో జ్యూస్ గ్లాసుతో జీతూ గదిలోకి ప్రవేశించాను.

మంచానికి అడ్డంగా పడుకుని సీరియస్‌గా ప్రాబ్లమ్స్ చేస్తోంది. మరుసటి రోజు మాథ్స్ సెకండ్ పేపరు.

జీతూ బేబీ హావ్‌యూ ఎనీప్రాబ్లమ్? ప్రక్కన కూర్చుంటూ అడిగాను. నో డాడీ అయామ్ ఆల్‌రైట్ అన్నది జ్యూస్ గ్లాసు అందుకుంటూ.

ఎక్కువ డిస్టర్బ్ చెయ్యటం ఇష్టంలేక అక్కడినుండి లేవబోయాను. నన్ను లేవనీయకుండా నా చేతిని పట్టుకుని మమ్మీ చందూ మామయ్య ఇంటికి వెళ్ళింది కదు డాడీ నా కళ్ళల్లోకి చూస్తూ. ప్రశ్నార్థకంగా చూశాను తన వైపు.

రేపు అత్తయ్యా, శేషుపిన్నీ, అమ్మమ్మా అందరూవస్తారట. కాలనీలో అందరినీ పిలిచి పేరంటం చేస్తారట. ఈ పేరంటం నా కిష్టంలేదు మమ్మీకి ఎంత చెప్పినా వినిపించుకోవటంలేదు. మీరయినా ఈ పేరంటం వద్దని చెప్పండి డాడీ ...... ప్లీజ్ ..... అన్నది.

నాకున్న ఆలోచనా విధానమే నా కూతురుకున్నందుకు కించిత్ గర్వపడ్డాను. అయినా అడిగేశాను. ఎందుకిష్టం లేదమ్మా అని.

- అందరినీ పిలిచి మా అమ్మాయి పెద్దమనిషయిందని చాటింపువేస్తే రేపు మన కాలనీ మగపిల్లలంతా ఎంత వింతగా చూస్తారో! ఆ చూపుల్ని తట్టుకుని నేను మునుపట్లా తిరగలేను. నాకి పేరంటం వద్దు.

జీతూ అంతర్మథనం

అంతకుమించి చెప్పలేకపోయింది కానీ అందులో ఎంతటి అంతరార్థం వుందీ? నా కళ్ళకిప్పుడు జీతూలో ఎదుగుతున్న వ్యక్తిత్వం కనబడుతున్నది. బాల్యాన్ని దాటుకుంటూ 'పెద్దమనిష'వుతున్న జీతూను వ్యక్తిగా ఎదగనివ్వాలి. వికసించాల్సింది ఆవిడ వ్యక్తిత్వం.

నా కిప్పుడొక విషయం అర్థంకాకుండా వుంది. పెద్దమనిషయినప్పటి వేడుకలు ఏ ఆడపిల్లా ఇష్టపడదా ? ఏమో ఇప్పటివాళ్ళు మాత్రం ఇష్టపడరు. జీతూ ఈ తరం పిల్ల.

** ** ** ** **

మీరేమంటున్నారో నాకర్థం కావటంలేదు. పిల్లకి పేరంటం కూడా చెయ్యలేదని నలుగురూ నవ్విపోతారు. మా వాళ్ళల్లో తలవంపులు పడలేను. ఇప్పటికే నేనంటే వాళ్ళకు చులకనగా వుంది. ఉన్న ఒక్క కూతురికీ వేడుక చేసుకోకపోతే ఇంక ఎంత వుండీ ఏం సుఖం? మీరీ విషయంలోనే ఎందుకు లోభిస్తున్నారో నాకర్థంకాకుండా వుంది అన్నది సుజాత.

నలుగురూ ఏమయినా అనుకుంటారని మనకిష్టంలేని పనులు చేసుకోనక్కర్లేదు. నీ కంత వేడుక చెయ్యాలనిపిస్తే ఇంటర్‌లోనో. ఎమ్‌సెట్‌లోనో దానికి ర్యాంకులు వచ్చాక చేసుకో. ఏదయినా ఘనకార్యం సాధిస్తే వేడుకగానీ ఉత్తిపుణ్యానికి వేడుక చేసుకుంటానంటా వేమిటి?

పెద్దమనిషవ్వటం అదేమంత ఘనకార్యమని? ఆడదయిపుట్టిన ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు అవుతూనే వుంటారు. దానికింత ఆర్భాటాలూ. హంగులూ అనవసరం. ఆడదానికి అదేజీవిత పరమార్థమయితే అదివేరేసంగతి. నా జీతూ జీవిత పరమార్థం వేరేవున్నది. ఆ బాటలో అది ఎక్కే ప్రతిమెట్టుకీ వేడుక చేద్దువుగాని. ఇప్పుడు నువ్వేదో వేడుక చేస్తున్నానని అనుకుంటున్నావేమో. అది వేడుకకాదు. దాని పాలిట సంకెళ్ళవుతాయి. పేరంటం తాంబూలం తీసుకున్న నలుగురూ నాల్గు సంకెళ్ళు దానికి తగిలించి వెళతారు. రేపణ్ణుంచి అది మనస్ఫూర్తిగా నవ్వేందుకు లేదు. ఆడేందుకు లేదు. పాడేందుకు లేదు. ఆడదానికి ఆడదే శత్రువంటారు. అది నిజమవునో కాదో కాని నువ్వు మాత్రం దానికి శత్రువులానే పరిణమించావు. మనసు విప్పి నీతో చెప్పుకోవాల్సిన విషయాలు నాతో చెప్పుకుంది. అదీవేళ లెక్కల పుస్తకంలో ఏంరాసిందో తెలుసా?

'అమ్మ ఒడిలో తలదాచుకోలేని అశక్తత అశ్రుధారలయి కురుస్తోంది'- అని

సుజాతా ......... జీతూ ఆవేదనని గ్రహించు. స్త్రీని స్త్రీయే అర్థం చేసుకోకపోతే ఎలా? ఒక్కసారి నీ బాల్య యవ్వనాల సంధికాలాన్ని గుర్తు తెచ్చుకో. నువ్వింత క్షోభా అనుభవించలేదూ? మనసుకురాని యవ్వనం శరీరానికి మాత్రమే వచ్చి మ నస్సు కూడా యౌ వ్వనాన్ని సంతరించుకునే వరకూ సాగే అస్తవ్యస్త ఒడిదుడుకుల జీవితాన్నీ 'అమ్మ ఒడిలో తలదాచుకోలేని అశక్తతనూ ఒక్కసారి గుర్తు తెచ్చుకో. ఆపరిస్థితి జీతూకు రానివ్వకు.

సుజాత మౌనంగా వింటూనే వుంది. మౌనం అర్థాంగీకారమన్న విషయం నిజమౌనో కాదో గాని సుజాత విషయంలో మాత్రం మౌనం పూర్తి అంగీకారమే. ఆ నిజం నాకే తెలుసు.

కాలింగ్‌బెల్ మోగటంతో లేచి వెళ్ళితలుపు తీశాను.

ఎదురుగా రావలసిన అతిథి డాక్టర్ 'సుమతీ సుప్రభాత'

* * * * * * * * *

